సాక్షి
నిజామాబాద్
సోమవారం । 27 । మే । 2024



దరికి చేర్చని స్పెషల్ డ్రైవ్

ధరణి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టినా.. భూ సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి.

- 8లో ▸



ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
44.8 /27.3

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో వంటశాల శుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ నాగారం: నగరంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో వంటశాలను ఆదివారం శుభ్రం చేశారు. ఆరోగ్యశ్రీ రోగులకు కుళ్లిన గుడ్లు, పురుగుల అన్నం అందిస్తున్నారని ఆదివారం 'సాక్షి' మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వంటశాల అధ్వానంగా ఉండడంతోనే పురుగులు వచ్చాయి. డైట్ వంటశాలను పరిశీలించి శుభ్రం చేయించాలని ఆదేశించారు. దీంతో సిబ్బంది వంటశాలను శుభ్రం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని కాంట్రాక్టర్ అధికారులకు హామీ ఇచ్చిన్నట్లు తెలిసింది.

తెయూలో మాక్ టెస్ట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో గోల్కొండ అకాడమీ సౌజన్యంతో గిరిజన శక్తి విద్యార్థి సంఘం, ఎస్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం గ్రూప్–1, గ్రూప్–2 మాక్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షలను గిరిజన శక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీను రాథోడ్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ రానున్న గ్రూప్1, 2 ఇతర పోటీ పరీక్షలకు ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఎస్‌ఎస్‌యూఐ నాయకులు సాగర్‌నాయక్, రాజేందర్, నిర్వాహకులు లక్ష్మణ్, శ్రీకాంత్, మోహన్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ పెంచడానికి కృషి



నిజామాబాద్ నాగారం: నగరంలోని సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ పెంచడానికి చర్యలు తీసుకుంటామని డీఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన సబ్‌స్టేషన్‌ను ఏడీఈ తోట రాజశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 3.15లోడ్ ఉందని, దీనిని మరింతగా పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన విద్యుత్ అందించడానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ గంగశేఖర్, సిబ్బంది దేవదాస్, గజేందర్ రమేశ్, సంజీవ్, ప్రేమ్‌లాల్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

బోధన్: సాలూర శివారులో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో జింక మృతి చెందింది. గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక చనిపోయింది. గ్రామస్తుల సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జింకకు పోస్టుమార్టం నిర్వహిస్తామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ తెలిపారు.

ఉల్లంఘనులకు చేయూత

- ఉమ్మడి జిల్లాలో జోరుగా అక్రమమైనింగ్
- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- కామారెడ్డి ప్రాంతంలోని క్వారీ, క్రషర్‌లకు రూ.53 కోట్ల జరిమానా
- తవ్వకాలు నిలిపి వేయించిన అధికార యంత్రాంగం
- అయినా వెనక్కి తగ్గని అక్రమార్కులు
- కండువా మార్చగానే అండగా నిలుస్తున్న అధికార పార్టీ నేతలు



కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం దేవునిపల్లి సమీపంలో ఉన్న స్టోన్ క్రషర్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటి లెక్కలు సరిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ నాయకులు మాత్రం సీఎం మాటలను తుంగలో తొక్కుతూ అక్రమాలకు పాల్పడుతున్న వారికే అండగా నిలుస్తున్నారు. నేతల అండతో కొందరు అనుమతులు లేకుండా, అనుమతి తీసుకున్న దానికంటే ఎక్కువ మొత్తంలో మొరం తవ్వకాలు, కంకర క్రషింగ్ చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో సహజ వనరులను ఇష్టారాజ్యంగా దోపిడీ చేసిన అక్రమార్కులు.. ఇప్పుడు కాంగ్రెస్ కండువా కప్పుకుని అదే రీతిలో అక్రమ మైనింగ్ కొనసాగిస్తున్నారు.

మంత్రి చెప్పినా..

జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు డిసెంబర్ 26న మొదటిసారి ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చారు. కామారెడ్డి వద్ద పాల్వంచ మండలంలోని దేవునిపల్లి, మంథని గ్రామాలకు చెందిన ప్రజలు ఆయనను కలిసి అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేశారు. భారీ పేలుళ్లతో ఇళ్లు బీటలు వారుతున్నాయని, మైనింగ్‌తో వందలాది బోరు బావులు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా అక్రమ మైనింగ్, బ్లాస్టింగ్స్ జరుగుతున్నప్పటికీ ఎందుకు చర్యలు చేపట్టలేదని సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులను మంత్రి ప్రశ్నించారు. తక్షణమే విచారణ చేసి సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. బాధితులకు క్వారీ యాజమాన్యంతో పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిజామాబాద్‌లో ఉమ్మడి జిల్లా సమీక్షలో సైతం మంత్రి మాట్లాడుతూ అక్రమ మైనింగ్‌ను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దీంతో కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని దేవునిపల్లి, ఇసాయిపేట గ్రామాల వద్ద కొనసాగుతున్న శ్రీనివాస స్టోన్ ఇండస్ట్రీస్ క్వారీకి గనుల శాఖ రూ.53 కోట్ల జరిమానా విధించింది. అనుమతులకు మించి చుట్టుపక్కల ప్రాంతాలను ఆక్రమించి క్రషింగ్ చేసినట్లు అధికారులు నిర్ధారించారు. అదేవిధంగా పాత బకాయిలు రూ.21 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. ఈ క్వారీ వద్దే నడుస్తున్న నైనిత కన్‌స్ట్రక్షన్ స్టోన్ క్రషర్‌కు రూ.34 లక్షలు జరిమానా విధించారు. దీన్ని మైనింగ్ ఏడీ క్రాంతికుమార్ ధ్రువీకరించారు.

అదనంగా తవ్వకాలు

ఆర్మూర్ శివారులో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రవీణ్‌రెడ్డి పేరిట అనుమతులకు మించి కంకర తవ్వకాలు చేసిన విషయమై ఉన్నతాధికారులు రూ.41 కోట్ల జరిమానా విధించారు. 3.6 హెక్టార్లకు అనుమతులు తీసుకుని అందుకు 95 శాతం అదనంగా తవ్వకాలు చేసినట్లు అధికార యంత్రాంగం తేల్చింది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న జీవన్‌రెడ్డిని కాదని అధికారులు ఏమీ చేయలేకపోయారు. అయితే ఇప్పుడు కూడా జరిమానా వసూలు చేయలేకపోతుండడం విశేషం.

ఏర్గట్ల మండలం బట్టాపూర్‌లో సైతం 13 వేల క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకుని అన్ని పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి 10 లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా కంకర తరలించారు. సుమారు రూ.300 కోట్ల మేర వ్యాపారం నడిచినట్లు అంచనా. దీన్ని కాలుష్య నియంత్రణ మండలి విభాగం మూసేసింది. దీనికి ఇప్పటివరకు అధికారులు పెనాల్టీ విధించకపోవడం గమనార్హం.

పార్టీ మారడంతో అన్నీ మాఫీ

శ్రీనివాస స్టోన్ ఇండస్ట్రీస్ క్వారీ, నైనిత కన్‌స్ట్రక్షన్ స్టోన్ క్రషర్ నిర్వాహకులకు జరిమానా విధించిన అధికారులు వాటిని మూసివేయించారు. ఈ క్వారీ, క్రషర్ యాజమాని లోయపల్లి నర్సింగ్‌రావు. ఆయన ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకోగానే ఆయనకు మద్దతు లభించింది. ఇంకేముంది ప్రభుత్వం విధించిన పెనాల్టీ తూచ్ అయింది. అనుమతుల ఊసే లేకుండా పోయింది. షబ్బీర్ అలీ అభయమివ్వడంతో నర్సింగ్‌రావు అక్రమ మైనింగ్‌కు రాచబాటలు వేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జరిమానా కట్టకుండనే క్వారీని నిర్వహిస్తుండడం ఈ ఆరోపణలకు బలమిస్తోంది. ఇక్కడ పర్యావరణ విధ్వంసం ఏ స్థాయిలో ఉందో చూస్తే పరేషాన్ కావాల్సిందే. క్వారీ వరకు గ్రామం బయట నుంచి నాలుగు కిలోమీటర్ల మేర ప్రత్యేక రోడ్డు వేసుకున్నారు. అడుగడుగునా ప్రైవేటు సైన్యం మాదిరిగా ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఇక్కడ ఫొటోలు తీయాలంటే సాహసం చేయాల్సిందే. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండానే రూ.వందల కోట్ల వ్యాపారం చేస్తుండడం విశేషం.



పొలాల్లో నుంచి క్వారీ వరకు ప్రత్యేకంగా నిర్మించిన రోడ్డు

హిందుత్వంతోనే ప్రపంచ శాంతి



మాట్లాడుతున్న సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్

నిజామాబాద్ నాగారం: ప్రపంచ దేశాల మధ్య శాంతిని నెలకొల్పే జీవన విధానం హిందుత్వమేనని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, విశ్రాంత ఇంజినీర్ విద్యాసాగర్ అన్నారు. నగరంలోని కంఠేశ్వర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ నీలకంఠేశ్వర ఉద్యోగి ప్రభాత్ శాఖ వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ 99 ఏళ్ల తన సుదీర్ఘ ప్రయాణంలో ఈ దేశంలో నెలకొన్న ఎన్నో సమస్యలకు సమాధానం చెప్పిందన్నారు. శతాబ్దాలుగా ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న అనైక్యత, అశాంతి వంటి సమస్యలకు సమాధానం ఇచ్చిందన్నారు. భారత్ విశ్వ గురువుగా మారుతుందని చెప్పారు. శాఖ అంటే సమాజ హితం కోసం వ్యక్తులను తయారు చేసే పరిశ్రమ అన్నారు. సంఘ సిద్ధాంతంలో శాఖకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. జీవితంలో స్థిరపడిన వ్యక్తులు సమాజంపై బాధ్యతను స్వీకరించాలన్నారు. ప్రతి హిందువు ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరాలన్నారు. సంస్థలో చేరడంతో దేశభక్తి, ధర్మనిష్ఠ అలవడుతాయని చెప్పారు. వార్షికోత్సవంలో స్వయం సేవకుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో నగర సంఘచాలక్ శ్రీనివాస్, నగర కార్యవాహ అర్గుల సత్యం, సహ కార్యవాహ సుమిత్ పాల్గొన్నారు.



హాజరైన ప్రజలు

అటవీ శాఖలో బదిలీలకు కసరత్తు

- ఉద్యోగుల పనితీరుపై మార్కులు వేస్తున్న ఉన్నతాధికారులు



డొంకేశ్వర్(ఆర్మూర్): అటవీ శాఖలో త్వరలో ఉద్యోగ బదిలీలు జరగనున్నాయి. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే బదిలీలు చేపట్టేందుకు కసరత్తు జరుగుతోంది. రేంజ్ ఆఫీసర్ల నుంచి మొదలుకొని బీట్ ఆఫీసర్ల దాకా నాలుగు కేడర్లకు స్థానచలనం కల్పించడానికి మార్కుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఉద్యోగుల పనితీరుకు మార్కులే కొలమానం కావడంతో అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అనుకున్న చోటికి బదిలీ కోసం అప్పుడే పోటీ మొదలైంది. అటవీ శాఖలో చాలా రోజులకు బదిలీల అంశం తెరపైకి రావడంతో ఉద్యోగులంతా స్థానచలనం కోసం ఉవ్విళ్లూరుతున్నారు. జిల్లా ఫారెస్టు శాఖలో మొత్తం ఏడు రేంజ్‌లున్నాయి. మొత్తం 131 పోస్టులు ఉండగా 75మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, 25మంది సెక్షన్ ఆఫీసర్లు పని చేస్తున్నారు. 12మంది డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ (డీఎఫ్‌ఆర్వో) ఆఫీసర్లు, ఆరుగురు ఫారెస్ట్ రేంజ్ (ఎఫ్‌ఆర్వో) విధులు నిర్వహిస్తున్నారు. అటవీ శాఖలో గత కొన్నేళ్లుగా బదిలీలు లేకపోవడంతో చాలా మంది దూరప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అలాంటి వారికి బదిలీలు పెద్ద ఉపశమనమనే చెప్పాలి.

పనితీరు రిపోర్టే కీలకం

జిల్లాలో బీట్ ఆఫీసర్లు ఎక్కువ మంది పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు బీట్ల అదనపు బాధ్యతలు ఉన్నాయి. రెగ్యులర్ బీట్‌తో పాటు అదనపు బీట్లను కూడా చూసుకోవాల్సి వస్తుంది. అలాగే సెక్షన్ ఆఫీసర్లు కూడా తమ సెక్షన్లలో పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. సెక్షన్, బీట్ ఆఫీసర్ల బదిలీలు వారి పనితీరుపై ఆధారపడి ఉన్నాయి. విధుల్లో క్రమశిక్షణ, అడవుల సంరక్షణ, ప్లాంటేషన్, నర్సరీల నిర్వహణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ చట్టాలను ఉల్లంఘించిన వారిపై కేసుల నమోదు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని రేంజ్ అధికారులు మార్కులు వేస్తున్నారు. మంచి మార్కులు వస్తేనే బదిలీలకు అవకాశం ఉంటుంది. అదే విధంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పనితీరుపై డివిజన్ ఫారెస్ట్ అధికారులు మార్కుల రిపోర్టును తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. మంచి మార్కులు కొట్టేయడానికి అటవీ శాఖలో ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు.

వేగంగా రోడ్డు విస్తరణ పనులు

- జాతీయ రహదారిగా బోధన్–భైంసా రోడ్డు
- రూ. 644.45 కోట్లతో 56.4 కి.మీల మేర నిర్మాణం



బోధన్‌లోని ఆచన్‌పల్లి సమీపంలో కొనసాగుతున్న బైపాస్ జంక్షన్ రోడ్డు విస్తరణ పనులు

బోధన్ రూరల్: బోధన్ నుంచి బాసర మీదుగా భైంసా వరకు జాతీయ రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతీయ రహదారి 161బీబీ విస్తరణలో భాగంగా జిల్లాలోని బోధన్ నుంచి నిర్మల్ జిల్లాలోని భైంసా వరకు 56.4 కిలోమీటర్ల మేర రూ.544.45 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నారు. 2022 నవంబర్‌లో ప్రధాని నరేంద్రమోదీ పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో వర్చువల్‌గా రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారి కోసం బోధన్, నిజామాబాద్, భైంసా రెవెన్యూ డివిజన్‌ల అధికారులు సర్వే, భూసేకరణ పూర్తి చేశారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. బోధన్ పట్టణ కేంద్రం నుంచి భైంసా వరకు 10 మీటర్లు (33ఫీట్లు) వెడల్పు, అవసరమైన చోట్ల మరింత వెడల్పుతో 56.4 కిలోమీటర్లు పనులు సాగుతున్నాయి.

నాలుగు బైపాస్‌లు

బోధన్ – భైంసా జాతీయ రహదారి విస్తరణలో ఇతర మార్గాలను కలిపేందుకు మొత్తం నాలుగు బైపాస్‌లు ఏర్పాటు చేస్తున్నారు. బోధన్ మండలంలోని ఆచన్‌పల్లి –పెగడపల్లి రోడ్డులో ఆచన్‌పల్లి వద్ద మొదటి బైపాస్, పెగడపల్లి సమీపంలో రెండో బైపాస్, రెంజల్ మండలంలో సాటాపూర్, తాడ్‌బిల్లోలి, బోర్గాం శివారులను కలుపుతూ మూడో బైపాస్, నవీపేట మండలంలో ఫకీరాబాద్ వద్ద నాల్గో బైపాస్– జంక్షన్‌లు నిర్మిస్తున్నారు. ఫకీరాబాద్ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం, గోదావరి నది మీదుగా బాసర మార్గంలో ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి పక్కన మరో కొత్త వంతెన నిర్మిస్తున్నారు. పలు చోట్ల మైనర్, మేజర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతున్నట్లు నేషనల్ హైవే అధికారులు తెలిపారు. పలు చోట్ల ఇప్పటికే రోడ్డు పనులు పూర్తవడంతో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. 2025 మార్చి వరకు రోడ్డు పనులు పూర్తయ్యే అవకాశం ఉందని నేషనల్ హైవే అధికారులు తెలుపుతున్నారు.



ఆచన్‌పల్లి సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి

50 శాతం పనులు పూర్తి

బోధన్ నుంచి భైంసా వరకు 161బీబీ జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 50శాతానికి పైగా రోడ్డు నిర్మాణం పూర్తయింది. బాసర సమీపంలోని గోదావరిపై కొత్త వంతెన, పలుచోట్ల బైపాస్ జంక్షన్‌లు, బ్రిడ్జిల పనులు జరుగుతున్నాయి. – బి శ్వేత, ఏఈఈ, నేషనల్ హైవేస్

15 నిమిషాల్లో బీభత్సం

- భారీ గాలివానకు నేలకొరిగిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- చెట్లుపడడంతో ధ్వంసమైన వాహనాలు
- ఎగిరిపోయిన రేకుల షెడ్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



రుద్రూర్‌లో చెట్టుపడి దెబ్బతిన్న కారు



అక్బర్‌నగర్ - బోధన్ రహదారిపై పడిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు



అంబంలో ఎగిరిపడిన రేకుల షెడ్డు, పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

రుద్రూర్: నిమిషాల వ్యవధిలో గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగి తీగలు తెగిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి వాతావరణంలో మార్పు చోటుచేసుకొని 15 నిమిషాలపాటు భారీగాలులు వీచాయి. ఎక్కడికక్కడ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు పడిపోతుండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. అక్బర్‌నగర్ –రుద్రూర్ ప్రధాన రహదారిపై చెట్లు నేల కొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు, తహసీల్దార్ ఘటనాస్థలానికి చేరుకొని నేల కొరిగిన చెట్లను తొలగింపజేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రుద్రూర్‌లో కారుపై, అంబం శివారులో ఆటో, రెండు బైకులపై చెట్లు పడడంతో వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. విద్యుత్‌స్తంభాలు పడిపోవడంతో సంబంధిత అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాలకు వెళ్లి నష్టాన్ని అంచనా వేశారు. అంబం, రుద్రూర్, రాణంపల్లిలో రేకుల పైకప్పులు ఎగిరిపోయాయి. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట, రుద్రూర్–రాణంపల్లి ప్రధాన రహదారిపై చెట్లు పడిపోవడంతో విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ తీగలు తెగిపోయాయి. కోటగిరి ఉమ్మడి మండలంలోనూ గాలులు బీభత్సం సృష్టించాయి.

అంధకారం

రుద్రూర్ మండల కేంద్రంతోపాటు అంబం, రాణంపల్లి, సిద్దాపూర్‌క్యాంప్, చిక్కడ్‌పల్లి అక్బర్‌నగర్ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి అర్ధరాత్రి దాటినా పలుగ్రామాలకు విద్యుత్ సరఫరా కాలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

'ఈ-స్టాంప్'లు దొరక్క అవస్థలు

- ఉమ్మడి జిల్లాలోని పది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొరత

దోమకొండ: స్టాంప్ పేపర్ల విక్రయం, వినియోగంలో అవకతవకలను అరికట్టేందుకు ప్రభుత్వం గతేడాది జూలై నుంచి ఆన్‌లైన్(ఈ–స్టాంప్)లో జ్యుడిషియల్ స్టాంప్ పేపర్ల విక్రయ విధానాన్ని ప్రవేశపెట్టింది. పారదర్శకత కోసం అమలు చేసిన ఆన్‌లైన్ విధానం కొత్త సమస్యలను తెచ్చిపెట్టిందనే అభిప్రాయం సర్వత్రావ్యక్తమవుతోంది. గతంలో స్టాంప్ వెండర్లు కొనుగోలుదారుడి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి స్టాంపులు విక్రయించేవారు. ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టి ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్టాంప్ పేపర్ కొనుగోలుదారుడి వివరాలను నమోదు చేసేలా యాప్‌ను రూపొందించారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలు బాండ్ పేపర్‌పై ప్రింట్ తీసి ఇవ్వాలి. ప్రతి ఏడాది వెండర్లు రిజిస్ట్రార్ ద్వారా రెన్యువల్ చేసుకోవాల్సి ఉండగా, స్టాంపులు విక్రయిస్తే 5శాతం కమీషన్ ఉంటుంది. ఇదంతా ఓ పద్ధతి ప్రకారం ఉన్నప్పటికీ ఆన్‌లైన్ స్టాంపులు దొరక్క వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.

వెండర్‌లకు తప్పని తిప్పలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం అందుకు అవసరమైన సామగ్రిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమకూర్చలేదు. దీంతో ఆన్‌లైన్‌లో స్టాంపులు దొరక్క వినియెగదారులు నానా అవస్థలు పడుతున్నారు. స్టాంపుల కోసం కొందరు మెదక్ జిల్లా రామయంపేటకు, మరికొందరు నిజామాబాద్ వెళ్తున్నారు.

ఆన్‌లైన్ స్టాంపుల కొరత ఉంది

అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే, జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో స్టాంపుల కొరత ఉంది. జిల్లా కేంద్రంలోని జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రమే ఫ్రాంక్లిన్ మిషన్ ఉంది, దీంతో ఆన్‌లైన్ స్టాంపుల కోసం అక్కడకి వెళ్లాల్సి వస్తుంది. త్వరలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫ్రాంక్లిన్ మిషన్‌ల ఏర్పాటు చేసి ఆన్‌లైన్ స్టాంపులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. – జబ్బర్, సబ్ రిజిస్ట్రార్, దోమకొండ

క్లుప్తంగా

మోర్తాడ్ ఎంపీపీకి అవార్డు



మోర్తాడ్: మోర్తాడ్ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ ఆదివారం హైదరాబాద్‌లోని తాజ్ హోటల్‌లో మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా భారత్‌కే అన్మోల్ అవార్డు అందుకున్నారు. సామాజిక రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ యాక్సెస్, ఎన్జీవో, ది న్యూస్ వారు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..తాను చేస్తున్న సేవలను గుర్తించి జాతీయస్థాయిలో అవార్డు అందజేసిన సంస్థ నిర్వాహకులు నిజాముద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖ అర్చకులు సంతోష్ శర్మకు అరుదైన గౌరవం



బోధన్‌రూరల్: బోధన్ పట్టణానికి చెందిన ప్రముఖ అర్చకులు సంతోష్ శర్మకు అరుదైన గౌరవం దక్కింది. తమిళనాడులోని చైన్నెలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. జ్యోతిష్యం, ఆగమ శాస్త్రం విభాగంలో ఆయన డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. దీంతో సోమవారం పట్టణ అర్చకులు, ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఆవుకు అంత్యక్రియలు



రెంజల్(బోధన్):సాంప్రదాయబద్ధంగా ఆవుకు అంత్యక్రియలు నిర్వహించి గోమాతపై ఉన్న మమకారాన్ని చాటిచెప్పారు రెంజల్ గ్రామస్తులు. రెంజల్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు లక్ష్మీగారి భూమయ్య పెంచుకున్న ఆవు(మంఘ్లీ) ఆదివారం మృతిచెందింది. ఆవుతో ఉన్న నాలుగేళ్ల అనుబంధంతో ఇంటి వద్ద పూజలు చేసి భాజాభజంత్రీలతో ఎడ్ల బండిపై తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.

అండగా ఉంటాం.. అధైర్య పడకండి

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం గ్రామంలో ఈదురు గాలులు సృష్టించిన బీభత్సంతో నష్టపోయిన కుటుంబాలను ఆదివారం సాయంత్రం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామంలో రోడ్లపై విరిగిపడి ఉన్న చెట్లను పక్కకు తొలగించి సహాయక కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ సింగ్, వెంకట్‌రెడ్డి, ఉద్దర హన్మాండ్లు, దేవేందర్‌రెడ్డి, మంత్రి గణేష్, మాసాని రవీందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, జనార్దన్ రెడ్డి, మన్నె విఠల్, అహ్మద్, అంబర్‌సింగ్ పాల్గొన్నారు.

తాడ్వాయిలో పెట్రోల్ బంకులు బంద్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని పెట్రోల్ బంకులు తరచుగా బందు ఉంచడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాడ్వాయి మండలం నుంచే ఇతర మండలాలకు చెందిన వినియోగదారులు పెట్రోల్, డీజిల్ పోసుకోవడానికి వస్తుంటారు. ప్రస్తుతం వ్యవసాయదారులు తమ వ్యవసాయ భూములను ట్రాక్టర్లతో దున్నిస్తున్నారు.పెట్రోల్ బంకులు మూసి ఉండడంతో కామారెడ్డి, దేవునిపల్లికి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందంటున్నారు. మండలంలో మూడు పెట్రోల్ బంకులు ఉన్నప్పటికి ఫలితం లేకుండా పోతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

బాన్సువాడ రూరల్ : ఇబ్రహీంపేట్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మాణానికి గ్రామానికి చెందిన దేవారం అఖిల– సాయిరెడ్డి దంపతులు రూ.50,116 విరాళం అందజేశారు. తమ పెళ్లిరోజు సందర్భంగా విరాళాలు ఇవ్వగా ఆలయ కమిటీ సన్మానించింది. గ్రామస్తులు పాల్గొన్నారు.

దరికి చేర్చని ధరణి స్పెషల్ డ్రైవ్

- ఇంకా పెండింగ్‌లోనే భూ సమస్యలు
- కొత్త నిబంధనలతో ఇబ్బందులు పడుతున్న రైతులు



ఇందల్వాయి: తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఐదుగురు సభ్యులతో కమిటీ వేసి లోపాల సవరణకు చర్యలు చేపట్టింది. కమిటీ సూచనల మేరకు ధరణి వెబ్‌సైట్‌లో కొన్ని మార్పులు చేసింది. కొన్ని అధికారాలను ఆర్డీవో, తహసీల్దార్‌లకు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఇంత చేసినా క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు.

క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడమే అసలు సమస్య..

ధరణి వెబ్‌సైట్‌లో ఉన్న లోపాలను సరిదిద్ది రైతుల సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలంటే క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను నిశితంగా అధ్యయనం చేసి అందుకు తగ్గట్లు ధరణి వెబ్‌సైట్‌లో ఆప్షన్లు ఇస్తే బాగుంటుంది. కానీ ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందడుగు వేయడం లేదు. ఈ కారణంగా వెబ్‌సైట్‌లో పొందుపర్చిన మాడ్యుల్ ఆప్షన్లు రైతుల సమస్యను పరిష్కరించలేకపోతున్నాయి. వ్యవసాయ భూముల్లో నెలకొన్న చాలా సమస్యలకు ఇంకా పరిష్కార మార్గాలు లేక అర్హులైన రైతులు ఆందోళన చెందుతున్నారు.

పరిష్కారం చూపని స్పెషల్ డ్రైవ్..

గతంలో జీఎల్ఎమ్(గ్రీవియెన్స్ రిలేటింగ్ టు ల్యాండ్ మ్యాటర్స్)లో దరఖాస్తు చేసుకున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మార్చి 1 నుంచి ధరణి స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఒకటికి రెండు సార్లు ధ్రువపత్రాలు, క్షేత్ర స్థాయి పరిశీలనలు, ఆర్‌ఐ, సర్వేయర్ విచారణలు చేసి దరఖాస్తులు స్వీకరించింది. అయినా ఇంతవరకు వాటిని పరిష్కరించి డిజిటల్ సంతకాలు చేసి పట్టాలు జారీ చేయడంలో మాత్రం అధికారులు విపరీతమైన జాప్యం చేస్తున్నారు. పాస్‌బుక్కుల్లో ఉన్న వివరాలకు, మోకాపై, పహాణీ నకల్లలో ఉన్న వివరాలకు పొంతన లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. రికార్డుల నిర్వహణలో పట్టాల పంపిణీ, ఆన్‌లైన్ రికార్డుల నమోదులో రెవెన్యూ అధికారులు గతంలో చేసిన తప్పులు రైతుల పాలిట ఇప్పుడు శాపాలుగా మారాయి.

ఎన్నికలు ముగిసినా పట్టించుకోని అధికారులు

రెండు నెలలుగా అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ధరణి సమస్యలపై దృష్టి సారించలేకపోయారు. కానీ ఎన్నికలు ముగిసినా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. జూన్ 4లోగా వివిధ దశల్లో పెండింగ్‌లో సమస్యలను పరిష్కరించాలని ధరణి కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. మరో వారం రోజులు గడువు మాత్రమే ఉండటంతో భూ సమస్యలు ఎంత వరకు పరిష్కారమవుతాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

పాత సమస్యలకు తోడు కొత్త నిబంధనలు

పట్టాలు లేని రైతులు పడుతున్న బాధలకు తోడు పట్టాలు ఉన్న రైతులకు మరో కొత్త సమస్య వచ్చి పడింది. గతంలో కొత్త పట్టా పాస్‌బుక్ ఉంటే మీ–సేవలో స్లాట్ బుక్ చేసుకుంటే సేల్‌డీడ్ కానీ, సక్సెషన్ కానీ రెండు రోజుల్లో పూర్తయ్యేది. కానీ ఇప్పుడు కొత్త పాస్‌బుక్‌లకు కూడా విలువ లేకుండా పోయింది. పట్టా మార్పిడి జరగాలంటే పాస్‌బుక్‌లో ఉన్న వివరాలు సరైనవేనని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరించి తహసీల్దార్‌కి నివేదిక ఇచ్చిన తర్వాతే పట్టా మార్పిడి జరుగుతుంది. దీనికి తోడు సర్వే నంబర్లలోని విస్తీర్ణంలో భారీగా వ్యత్యాసం నెలకొని ఉండటంతో కూడా పట్టా మార్పిడికి నెలల సమయం పడుతుందని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు.

ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్నా..



నల్లవెల్లి గ్రామంలోని సర్వే నంబరు–352లో 1–16 గుంటల మా భూమిని ఆన్‌లైన్‌లో మరొకరి పేరు మీదకు మార్చి డిజిటల్ సంతకం పూర్తి చేయలేదు. అన్ని ఆధారాలతో దరఖాస్తు చేసుకున్నా ఏడాదిన్నర కాలంగా మా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఈ మధ్యే ధరణి స్పెషల్ డ్రైవ్‌లో మళ్లీ విచారణ చేసి ధ్రువ పత్రాలు తీసుకున్నారు. అయినా కూడా మా సమస్య పరిష్కారం కాలేదు. – ఎస్‌సీ రాజారెడ్డి, నల్లవెల్లి

పట్టా రావట్లేదు



మా నాన్న పేరు మీద నల్లవెల్లిలోని సర్వే నంబరు–225లో ఉన్న ఒకటిన్న ఎకరం భూమి ఆధార్ అనుసంధానం కాలేదని డిజిటల్ సంతకం చేయలేదు. మా నాన్న చనిపోయి రెండేళ్లు అవుతున్నా ఆ భూమిని నా పేరు మీద చేయాలని తహసీల్ చుట్టూ తిరుగుతున్నా. ధరణి స్పెషల్ డ్రైవ్‌లో కూడా మా సమస్యపై విచారణ చేపట్టారు. రెండు నెలలు గడుస్తున్నా పట్టా మంజూరు కాలేదు. – పాతకుంట రాములు, నల్లవెల్లి

అటవీ భూమి కోసం రెండు తండాల మధ్య ఘర్షణ



అటవీ భూమిని దున్నుతున్న గిరిజనులు

గాంధారి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ఓ పక్క అడవులను అభివృద్ధి చేయాలని ప్రయత్నం చేస్తుంటే.. మరో పక్క గిరిజనులు అడవులను ట్రాక్టర్లతో దున్నుతూ సాగు చేస్తున్నారు. అయితే అటవీ భూముల ఆక్రమణ కోసం పలు తండాల శివారుల్లో తండావాసులు పరస్పర ఘర్షణలకు దిగుతున్నారు. తాజాగా ఆదివారం కొత్తాబాదితండా, సోమారం తండావాసులు అటవీ భూమి తమ శివారు, అంటే తమ శివారు అంటూ పరస్పర దూషణలు చేసుకున్నారు. ఇరు తండాల రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. సమస్య తమది కాదని అటవీ శాఖ అధికారులు సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తారని ఫిర్యాదుదారులకు సూచించి ఈ విషయాన్ని స్థానిక ఎఫ్ఆర్వో దృష్టికి ఎస్సై తీసుకువెళ్లారు. అటవీ శాఖ అధికారులు సర్వే చేసి సమస్యను పరిష్కరించాలన్నారు.

లాడ్జిలో వ్యభిచారం.. నిర్వాహకులపై కేసు

ఖలీల్ వాడి: నగర రైల్వే స్టేషన్‌కు సమీపంలోని నవదుర్గ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడులలో నిర్వాహకులు చెన్న గంగాదాస్ అలియాస్ రాము, చెన్న దీక్షిత్, గుండేటి భోజన్న, సతీష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. బాధితురాలిని సదరం హోమ్‌కు తరలించారు.

హిజ్రాలకు కౌన్సెలింగ్

ఖలీల్‌వాడి: నగర రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలోని అహ్మదీబజార్‌లో వ్యాపారుల నుంచి హిజ్రాలు బలవంతంగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై రాము, హిజ్రాలను పోలీస్‌స్టేషన్‌కు రప్పించారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. డబ్బుల కోసం బలవంతం చేయకూడదని చెప్పారు. వ్యాపారులు ఇచ్చినవి తీసుకుని సంతృప్తి పడాలని సూచించారు. మళ్లీ ఇలాంటి ఫిర్యాదు వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

టిప్పర్ సీజ్

రుద్రూర్: సిద్దాపూర్ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ వెంకటేశం తెలిపారు. అనుమతి లేకుండా మొరం తరలిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): సదాశివనగర్ మండల కేంద్రంలోని సత్య పీర్ల దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆదివారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. జక్కుల చంద్రం(50) అనే వ్యక్తి కామారెడ్డి వైపు నుంచి పద్మాజీవాడి వైపు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలోనే వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ సంతోష్ కుమార్ పరిశీలించారు.

లారీని ఢీకొనడంతో..

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం శివారులో జాతీయ రహదారి–44పై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వర్ని మండలం జలాల్‌పూర్‌కు చెందిన పడమటి సందీప్(26) మృతి చెందాడు. మెండోరా ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. డెలివిర్ డాట్ కామ్‌లో విధులు నిర్వహించే సందీప్ కంపెనీ వాహనంలో సామాను తరలించేందుకు వెళ్తున్న సమయంలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనం అదుపు తప్పి ఒకరు..

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోర్తాడ్‌కు చెందిన లోకేవల్ చందు (30) మృతిచెందాడు. వివరాలు.. ఆదివారం మోర్తాడ్ నుంచి ఆర్మూర్ వైపు బైక్‌పై వస్తుండగా పెర్కిట్ శివారులో అదుపుతప్పి కిందకు పడిపోయాడు. దీంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే చందును జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి ..

కామారెడ్డి క్రైం: రైలు నుంచి కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్, మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌ల మధ్య ఆదివారం వెలుగు చూసింది. వివరాలు.. పట్టాల పక్కన మృతదేహం పడి ఉందని సమాచారం రావడంతో కామారెడ్డి రైల్వే ఎస్సై తావూనాయక్, సిబ్బంది అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడి వయస్సు 55 నుండి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని ఎస్సై తెలిపారు. నడుస్తున్న రైలులో నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి మృతి ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

బోధన్ టౌన్ (బోధన్): పట్టణంలో బంధువుల వివాహానికి హాజరైన గంగాధర్(20) అనే యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన గంగాధర్ తన కుటుంబ సభ్యులతో ఈ నెల 24న బోధన్ పట్టణంలో బంధువుల వివాహ వేడుకకు వచ్చాడు. అక్కడ తన తల్లితో గొడవపడి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధు మిత్రుల దగ్గర ఆచూకీ కోసం గాలించారు. ఎక్కడా యువకుడి జాడ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సదాశివనగర్‌లో బాలుడు..



జైపాల్


రామారెడ్డి(ఎల్లారెడ్డి): సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన గంట జైపాల్(13) అనే బాలుడు ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని ఎస్సై రాజు తెలిపారు. జైపాల్ తండ్రి సంజీవ్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలుడు ఎవరికైనా కనిపిస్తే 8712686164 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

అదుపు తప్పి కారు బోల్తా

నవీపేట: నాగేపూర్ మూల మలుపు వద్ద ఆదివారం సాయంత్రం కారు బోల్తా పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన దంపతులు గణేష్, అనురాధలు తమ కుమారుడు దీపక్‌తో కలిసి బాసరలోని సరస్వతి దేవి దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా.. నాగేపూర్ మూల మలుపు వద్ద ప్రమాదం జరిగిందని ఆయన చెప్పారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, వాహనం స్వల్పంగా దెబ్బతిందన్నారు.

మస్కట్‌లో కృష్ణాజీవాడివాసి మృతి

- రోడ్డు ప్రమాదంలో మృత్యువాత
- అనాథ శవంగా సోషల్ మీడియాలో ప్రచారం
- 12 రోజుల అనంతరం గుర్తు పట్టిన కుటుంబసభ్యులు
- శవాన్ని రప్పించేందుకు ఆర్థిక ఇబ్బందులు



మృతుడు దాసరి నర్సింలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన దాసరి నర్సిములు(41)అనే వ్యక్తి మస్కట్‌లో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. నర్సింలు అప్పు చేసి బతుకుదెరువు కోసం గత నెలలో మస్కట్‌కు వెళ్లాడు. అక్కడి కంపెనీలో కొన్ని రోజులు మాత్రమే పనిచేశాడు. ఈనెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సింలు మృతిచెందాడు. అది కూడా అనాథ శవమని సోషల్ మీడియా ద్వారా తెలిసింది. ఆ శవం నర్సింలుదేనని 12 రోజుల అనంతరం కుటుంబసభ్యులు గుర్తు పట్టారు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె నందిని, కుమారుడు నిఖిల్ ఉన్నారు. అక్కడి నుంచి శవాన్ని ఇండియాకు తేవాలంటే అక్కడికి డబ్బులను పంపించాలని కోరినట్లు దాసరి పద్మ రోదిస్తూ తెలిపారు. ప్రభుత్వం స్పందించి మస్కట్ నుంచి తన భర్త మృతదేహన్ని తెప్పించాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో మేక మృతి

సిరికొండ: న్యావనంది గ్రామంలో సెల్ టవర్ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో మేక మృతి చెందింది. ఇక్కడే రెండు నెలల క్రితం ఒక పొట్టేలు కూడా షాక్‌కు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సెల్ టవర్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ చాలా తక్కువ ఎత్తులో ఉందని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తు పెంచాలని ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నష్టపరిహారం ఇప్పించాలని మేక యజమాని పుర్రె పాపయ్య కోరారు.

ప్రభుత్వ బడుల్లో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

- ప్రతి ఏటా పెరుగుతున్న ఉత్తీర్ణత శాతం
- ఈ ఏడాది 103 మందికి 10 జీపీఏ



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఓ ప్రకటనలో తెలిపారు. పేద, మధ్య తరగతి, సంపన్నుల వారు సైతం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీ, నవోదయ, గురుకులాల్లో చదువుకునే అవకాశం లభిస్తుందన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు. ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ బడుల్లో చదివిన 103 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించడం ఎంతో గర్వకారణం అన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ బడులు మంచి విద్య అందించడం వల్ల విద్యార్థులకు నాణమైన విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. భవిష్యత్తు ప్రభుత్వ బడుల్లోనే ఉందన్నారు.

ఐపీఎస్ అవుతాను



నేను సివిల్స్ రాసి ఐపీఎస్ అవుతాను. మా టీచర్ల ప్రోత్సాహంతో పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాను. నా తల్లిదండ్రుల కల నేరవేర్చుతాను. 10 జీపీఏ సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం కోసం ప్రయత్నలు చేస్తున్నాను.

– సీహెచ్ అంకిత, మహాత్మాజ్యోతీబాపూలే పాఠశాల, దాస్‌నగర్

తల్లిదండ్రుల కల సాకారం చేస్తా



నేను గొప్ప ఇంజినీర్ అయి మా తల్లిదండ్రుల కల సాకారం చేస్తాను. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాను. 10 జీపీఏ సాధించడం వల్ల నాలో నాకు ఎంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. టీచర్లు ఎంతో అంకిత భావంతో బోధించారు.

– దాక్షాయణి, జెడ్పీహెచ్‌ఎస్, బోర్గం(పి)పాఠశాల

విద్యా బోధన బాగుంది



నేను దాస్‌నగర్ మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాలలో చదివి 10 జీపీఏ సాధించాను. ప్రస్తుతం ఇక్కడే ఇంటర్ అడ్మిషన్ తీసుకున్నా. మరిన్ని మంచి మార్కులు వస్తాయని భావిస్తున్నా. ఇక్కడ విద్యా బోధన ఎంతో బాగుంది. ఇక్కడి టీచర్లు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు. చక్కటి విద్యకు బాటలు వేస్తున్నారు.

–జీవని,మహాత్మాజ్యోతీబాపూలే పాఠశాల,దాస్‌నగర్

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం



వ్యవసాయ కుటుంబంలో జన్మించాను.నేను ఐఐటీలో సీటు సాదించడమే లక్ష్యంగా చుదువుతున్నాను. టీచర్ల బోధన, మంచి ప్రణాళిక వల్ల 10 జీపీఏ సాధించాను. మా పాఠశాలలో అన్ని వసతులు బాగున్నాయి. ఇదే స్ఫూర్తి కొనసాగిస్తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాను.

–పల్లవి, మహాత్మాజ్యోతీబాపూలే పాఠశాల,దాస్‌నగర్

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఒడ్డెర కాలనీకి చెందిన నర్ర రాజేందర్(50) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొన్ని నెలలుగా రాజేందర్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు రాజేందర్‌ను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య నర్ర గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెట్రోల్ పోసుకొని మరొకరు..

ఆర్మూర్‌టౌన్: మిర్దాపల్లి గ్రామానికి చెందిన కర్రోల్ల పోశెట్టి(40) శనివారం రాత్రి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్ని నెలలుగా ఆర్మూర్‌లో ఉంటూ కూలి పనులకు వెళ్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. తాగడానికి డబ్బులు దొరక్క, ఎవరూ డబ్బులు ఇవ్వకపోవడంతో పోశెట్టి ఆదివారం ఇంట్లోనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



నీటి ట్యాంకులో పైపును పట్టుకున్న కాశీరాం..



ఫైర్ సిబ్బందితో.. కాశీరాం

ఎల్లారెడ్డి: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కల్యాణి గ్రామానికి చెందిన బండారి కాశీరాం(35) ఆదివారం ఇంట్లో గొడవ పడి ఎల్లారెడ్డి పట్టణంలోని వైశ్యభవన్ ఆవరణలో గల నీటి ట్యాంకు పైకి ఎక్కి హంగామా సృష్టించాడు. కొద్ది సేపటి తరువాత నీటి ట్యాంకులో దూకడంతో స్థానికులు గమనించి పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఎస్సై మహేష్ ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బంది సహకారంతో నీటి ట్యాంకులో దూకిన కాశీరామ్‌ను బయటకు తీశారు. అనంతరం కాశీరామ్‌ను ఆస్పత్రికి తరలించారు.

గ్యాస్ సిలిండర్ లీక్

- ఒకరికి తీవ్ర గాయాలు



గ్యాస్ లీకై మంటలు అంటుకున్న సిలిండర్

ధర్పల్లి: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు అంటుకున్న ప్రమాదంలో ఒకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ప్రకాష్ ఒక గదిలో ఒక గ్యాస్ సిలిండర్ నుంచి మరొక గ్యాస్ సిలిండర్‌కు రీఫిలింగ్ చేస్తుండగా లీక్ కావడంతో భారీ శబ్దంతో మంటలు వ్యాపించాయి. దీంతో ప్రకాష్‌కు మంటలు అంటుకున్నాయి. భారీ శబ్దం సంభవించడంతో అక్కడికి చేరుకున్న స్థానికులు మంటలను ఆర్పి బాధితుడిని బయటకు తీసుకొచ్చారు. తీవ్ర గాయాలైన ప్రకాష్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంటలు వ్యాపించిన సమయంలో గదిలో చాలా సిలిండర్లు ఉన్నాయని, అవి పేలితే ప్రాణ, ఆస్తి నష్టం భారీగా ఉండేదని స్థానికులు చెప్పారు.



గాయపడిన ప్రకాష్

జోరుగా ఐపీఎల్ బెట్టింగులు


ఖలీల్‌వాడి: ఐపీఎల్ ఫైనల్స్ నేపథ్యంలో జిల్లాలో జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. బెట్టింగ్ ముఠాలు పెద్ద ఎత్తున రంగంలోకి దిగాయి. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి సమాచారం కావాల్సిన వారికి పంపించాయి. గ్రామీణ ప్రాంతంతో పాటు నగరంలోని హోటళ్లు, శివారు ప్రాంతాలతోపాటు అపార్ట్‌మెంట్స్, ఫామ్‌హౌసుల్లోని గదులను అద్దెకు తీసుకుని బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

వాట్సాప్ ద్వారా రూ.100 నుంచి రూ.లక్షల వరకూ పందేలు ఆహ్వానిస్తున్నారు. పందెం సొమ్ములు చేతులు మారుతున్నా బెట్టింగ్ నిర్వాహకులు పోలీసులకు చిక్కిన దాఖలాలు లేవు. ఆన్‌లైన్ ద్వారా పందేలు జరుగుతుండటంతో నిఘా వర్గాలు గుర్తించలేకపోతున్నాయి. స్మార్ట్ ఫోన్, లోన్ యాప్‌లతో అప్పులు, రెట్టింపు లాభాలంటూ యువకులకు వల వేస్తున్నారు. చాలా మంది పందేలకు బానిసలుగా మారారు. కొందరు అప్పులు తీర్చలేక బలవన్మరణానికి పాల్పడ్డిన ఘటనలు ఉన్నాయి.

బాల్ టూ బాల్..

ఐపీఎల్ ఫైనల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కత్తా నైట్ రైడర్స్ పోటీలో ఉన్నాయి. బెట్టింగ్ రాయుళ్లు బాల్ టూ బాల్, రన్ టూ రన్, త్రీ రన్, ఫోర్, సిక్స్ వంటి వాటితోపాటు వైడ్, నోబాల్, అవుట్, రనవుట్, క్యాచ్ వంటి వాటిపై పందేం రాయుళ్లు బెట్టింగ్ పెట్టారు. జిల్లాలో ఈ బెట్టింగ్ రూ.లక్షల్లో జరిగిందని పలువురు అంటున్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



గంగొల్ల శివాయి

జక్రాన్‌పల్లి: కేశ్‌పల్లి గ్రామానికి చెందిన గంగొల్ల శివాయి(73) అనే వృద్ధురాలు వడదెబ్బతో మృతి చెందింది. శివాయి ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో ఇంటి నుంచి కొరట్‌పల్లి గ్రామ శివారులో గల మల్లన్న గుడికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరి వెళ్లింది. గుడికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తూ కొరట్‌పల్లి తండా శివారులో రోడ్డు పక్కన మృతి చెందింది. వడదెబ్బకు శివాయి మృతి చెంది ఉండొచ్చని ఆమె కోడలు సుమలత, డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారాంనగర్‌లో ఓ మైనర్ బాలిక(12)పై అత్యాచారం చేసిన కేసులో ఒక వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రోజువారీ కూలి పనిచేసే తల్లిదండ్రులు ఇంట్లో మైనర్ బాలికను ఉంచి జీవనోసాధి కోసం శనివారం బయటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించి బాలికకు మాయ మాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.